క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దుల్లా హబీబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 6గంటల నుంచి ఉదయం 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీఐఏ ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడిగా సోమయ్య



త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట గ్రామానికి చెందిన బొజ్జ సోమయ్య సమాచార హక్కు చట్టం(ఆర్టీఐఏ) ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమయ్య మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. అందరికీ అందుబాటులో బాధ్యతగా ఉంటానని, తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు

కొండమల్లేపల్లి : మండల సెక్టార్ పరిధిలోని పెండ్లిపాకలలోని బాబుల తండా, చింతకుంట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు నీతి కథల పుస్తకాలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐదేళ్లు నిండిన విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, తల్లులు, బాలబాలికలు పాల్గొన్నారు

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలోని సరస్వతీ శిశు మందిర్ స్కూల్‌లో ఆదివారం నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తొగోటి రమేష్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, డ్రాయింగ్, తెలుగు ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అవకాశాన్ని నల్లగొండ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9553985143, 9297251309 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జనార్దన్‌రావుకు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ టూటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్ రావు దశదిన కర్మలో శనివారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, ఎస్.భాస్కర రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఇతర పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కటికన్ సత్తయ్య గౌడ్ , రామచంద్రనాయక్, పంకజ్ యాదవ్, మాలె శరణ్య రెడ్డి , సైదిరెడ్డి పాల్గొన్నారు.

చట్టపరమైన భద్రత లేక బీసీ వర్గాలపై దాడులు



మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి రవి

నల్లగొండ రూరల్: చట్టపరమైన భద్రత లేకపోవడంతోనే బీసీ సామాజిక వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని నల్లగొండ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి రవి రమాదేవి అన్నారు. శనివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గాల వారిని కులం పేరుతో దూషిస్తూ దాడులు చేస్తున్నారని, భౌతిక దాడులను అడ్డుకునేందుకు బీసీలు ఐక్యంగా ఉండాలన్నారు. ఏ పార్టీలో తిరిగినా బీసీ వర్గాలను గెలిపించేందుకు ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి గడగోజు విజయ్, హరిశంకర్, శ్రీశైలం, మాదగోని శివ కుమార్ పాల్గొన్నారు.

పూర్తికాని ఇంకుడు గుంతల సర్వే

- 27వ తేదీతో ముగిసిన గడువు
- 25,867 అసెస్‌మెంట్స్‌కు 170 మాత్రమే పరిశీలన
- ఎండల తీవ్రతతో నెమ్మదిగా కొనసాగిన సర్వే



ఆపార్ట్‌మెంటులో ఇంకుడు గుంతల వివరాలను సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : ఇంకుడు గుంతల సమాచారాన్ని తెలుసుకునేందుకు అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వే నత్తనడకన కొనసాగుతోంది. ఇందుకు కోసం నియమించిన బృందం సభ్యుల్లో ఒక వైపు సమన్వయ లోపం కాగా మరో వైపు ఎండ తీవ్రతతో నెమ్మదిగా సాగుతోంది ఈనెల 27వ తేదికే పూర్తి కావాల్సిన ఇంటింటి సర్వే ప్రక్రియ 25శాతం పూర్తికాకపోవడం గమనార్హం. భవన నిర్మాణ సమయంలోనే ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలనే నిబంధన ఎంత వరకు అమలు అయిందో తెలుసుకునేందుకు సర్వే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల బెంగుళూరులో నెలకొన్న నీటి సమస్య నేపథ్యంలో ఆ అంశాన్ని న్యాయస్థానాలు సుమోటాగా తీసుకున్న విషయం విధితమే. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు తప్పని సరి అని, నిబంధనల ప్రకారమే వాటి నిర్మాణం చేపడుతున్నారా..? అనే అంశంపై అధికారులు సీరియస్‌గా తీసుకొని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు ముమ్మరం చేశారు.

మొత్తం అసెస్‌మెంట్స్	25,867
గృహాలు	25,322
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు	545
ప్రస్తుతం పూర్తి చేసినవి మొదటి విడత (300 చదరపు మీటర్లు)	170
ఇంకుడు గుంతలు ఉన్నవి	44
లేనివి	126

మొదటి విడతలో 300చదరపు మీటర్లు

మున్సిపాలిటీలో ప్రతి నెల భవన నిర్మాణాల అనుమతుల కోసం పెద్ద మొత్తంలో దరఖాస్తులు వస్తున్నాయి. వీటిలో బహుళ అంతస్తుల భవనాలు, వ్యక్తిగత ఇళ్లు ఉంటాయి. అనుమతులు ఇవ్వాలంటే .. తప్పనిసరిగా సదరు నిర్మాణదారులు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సంబంధిత ఫొటోలు, సైతం దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఖచ్చితంగా అమలు అయితే..అనుమతులు తీసుకున్న ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఉండాలని, వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మార్చి 22వ తేది నుంచి రంగంలోకి దిగారు. ప్రాధాన్యత క్రమంలో ఇళ్లను తనిఖీ చేయాలని నిర్ణయించి మొదటి విడతలో 300 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించిన భవనాలను తనిఖీలను చేపడుతున్నారు. ఇందు కోసం మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులకుగాను 48 మంది వార్డు ఆఫీసర్లతో బృందాలను నియమించి ఇంటింటి సర్వే చేపడుతున్నారు.

సర్వే ముమ్మరం చేస్తాం



ఎండ తీవ్రంగా ఉండటంతో సిబ్బంది కూడా కొంత ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్వేను ఉదయమే చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. మొదటి విడతలో ఆపార్ట్‌మెంట్లు, 300 చదరపు మీటర్లు ఉన్నవాటిని గుర్తిస్తున్నాం. సర్వే ముమ్మరంగా చేయించేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటాం.

– ఎండీ. యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఆరు గ్యారంటీల అమలు.. పెద్ద బోగస్



చింతపల్లి : సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు పెద్ద బోగస్ అని నల్లగొండ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి కుటుంబాలు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొడిగె సాంబశివగౌడ్, కుంభం యాదగిరిగౌడ్, నక్క వెంకటేశ్‌యాదవ్, నేతావత్ లాలునాయక్, చెనమోని రాములు, ఏటీ కృష్ణ, జహీర్, వరికుప్పల వెంకటయ్య, భరత్, నగేశ్, జంగిటి మల్లేశ్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు మంత్రులు అసమర్థులే

చింతపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇద్దరు మంత్రుల అసమర్థులేనని నల్లగొండ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న పడవలాంటిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాములు, లాలునాయక్, శేఖర్, చెన్నయ్య, శివర్ల రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



మాడుగులపల్లి : కుక్కడంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్ మానిక్‌రావు సూర్యవంశీ హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలోని వేములపల్లి, దామరచర్ల మండలాల్లో, మిర్యాలగూడ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను, శెట్టిపాలెంలోని చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో అధిక శాతం పోలింగ్ జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్క ఓటరుకు స్లిప్‌లను అందజేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్ శర్మ, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఎన్నికల పరిశీలన అధికారి మనోజ్‌కుమార్ మాణిక్‌రావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, నీడకోసం షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతులు కల్పించాలన్నారు. ఓటర్లకు పోలింగ్ స్లిప్పుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మాడుగులపల్లిలో ఏ మేరకు పంపిణీ చేసింది బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ పద్మ, ఆర్‌ఐ అక్తర్ అలీ, బీఎల్‌ఓలు మరియమ్మ, సుశీల, ఊర్మిళ, రజిత ఉన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంట్ల, చిన్న అడిశర్లపల్లి గ్రామాలకు చెందిన సుమారు 60కుటుంబాలు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, నాయకులు వేమన్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, ముడావత్ మంగ్యానాయక్, బొడ్డుపల్లి సైదులు, కుంభం శ్రీనివాస్‌గౌడ్, గంధం సురేష్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ సుమలత, భాస్కర్‌రావు, వెంకటయ్య, శవ్వ శ్రీను, దేవేందర్ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

చింతపల్లి : దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మదనాపురం లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవరెడ్డి, నాగ భూషణం, పవన్‌కుమార్, నర్సింహా, గోవర్ధన్, నర్సింహారెడ్డి, హరినాయక్, శత్రుఘ్నరాజు, పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

నాగార్జునసాగర్ : బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీల్లో ఆ పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. హిల్‌కాలనీలో కౌన్సిలర్ రమేశ్‌జీ జెండాను ఆవిష్కరించగా, పైలాన్‌కాలనీలో చాంద్ పాషా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైదులు, లక్ష్మణ్ నాయక్, షేక్ నజీర్, మన్సూర్, శేఖరాచారి, రామస్వామి, మహేష్,దావూద్‌అలీ, ప్రసాద్, ఏసు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న షేక్ చాంద్‌పాషా, రమేశ్‌జీ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

మర్రిగూడ : మర్రిగూడ మండల వ్యాప్తంగా 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రూట్ మ్యాప్‌లకుగాను నలుగురు సెక్టార్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 30,086 మంది ఓటర్లు ఉన్నారని, వచ్చే నెలలో జరగబోయే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట డీటీ తారకరామన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్‌ఐ బషీర్ ఉన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి సొంత భవనం నిర్మించాలి



ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఈఎస్ఐ ఆస్పత్రికి సొంత భవనం నిర్మించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం ఈఎస్ఐ ఆస్పత్రి పెండింగ్ అద్దె బిల్లులు చెల్లించాలని, సొంతభవనం నిర్మించాలని కోరుతూ ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 20వేల మంది కార్మికులు ఉన్నారని వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అప్పటి ఎమ్మెల్యే గా ఉన్న జూలకంటి రంగారెడ్డి సహకారంతో ఆస్పత్రిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వేలాది మంది కార్మికులు చికిత్స పొందుతున్న ఈ ఆస్పత్రి అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని తాళం వేయడంతో కార్మికులకు వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే మంజూరు చేయాలని, అద్దెను చెల్లించి ఈఎస్ఐ డిస్పెన్సరీ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రామ్మూర్తి, నాయకులు రవినాయక్, వినోద్‌నాయక్, జన్నయ్య, శ్రీను, దేవయ్య, ఈదయ్య తదితరులున్నారు.

రేపు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రోడ్‌షో



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి సోమవారం దేవరకొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల పరిధిలో రోడ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈరోడ్ షోను బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, తిరుపతయ్య, జనార్దన్‌రావు, ఏర్పుల గోవింద్, రాజవర్ధన్, శ్రీనివాస్‌గౌడ్, బాలయ్య, లోక్యానాయక్, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సింహ



దేవరకొండ : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరకొండకు చెందిన అంకూరి నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంకూరి నర్సింహ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై చిత్తశుద్ధితో తనకు అప్పగించిన బాధ్యతను పాటిస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉట్లపల్లిలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని ఉట్లపల్లిలో మేధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్, మగ్గం, బ్యూటీషన్ శిక్షణ కేంద్రాన్ని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేణుగోపాలచారి, ఇన్‌చార్జ్ కొత్తపల్లి సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఇండ్ల నాగేంద్రబాబు, కార్యదర్శి వెంకన్న, సభ్యులు ఎల్లయ్య, శిక్షణ పర్యవేక్షురాలు వూరే నాగమణి, కవిత, పుష్పవతి, ప్రభావతి, మాధవి, నాగలక్ష్మి, శ్రీదేవి, మౌనిక, భారతమ్మ, శైలజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలోని వార్డును పరిశీలిస్తున్న డీసీహెచ్ఓ

నాగార్జునసాగర్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాతృనాయక్ తెలిపారు. శనివారం నందికొండలోని కమలానెహ్రూ ఆస్పత్రిని ఆయన సందర్శించి వార్డులను పరిశీలించి రోగులను పలకరించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు భోజనం ఏ విధంగా పెడుతున్నారో వంటశాలకు వెళ్లి పరిశీలించారు. వేసవిలో రోగుల పట్ల శ్రద్ధతీసుకోవాలని ఫ్యాన్లు తిరిగేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికే పెరిక కులస్తుల మద్దతు



మిర్యాలగూడటౌన్ : వీరయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



త్రిపురారం : బెజ్జికల్‌లో విజయ సంకల్ప యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

త్రిపురారం : పెరిక కులస్తుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌కే ఎంపీ ఎన్నికల్లో పెరిక కులస్తులందరీ మద్దతు ఉంటుందని వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రారంభమైన విజయ సంకల్ప యాత్ర-2 సాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలానికి శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని బెజ్జికల్, చెన్నాయిపాలెం, మర్రిగూడెం గ్రామ పెరిక కులస్తులు, పింఛన్‌దారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం పింఛన్ల పెంపు ఉంటుందని, జిల్లాలో పెరిక కులస్తులకు ఉన్న సుమారు 80వేల ఓట్లు ఉన్నాయని, వారందరూ రఘువీర్‌రెడ్డి చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లిఖార్జునరావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షుడు మైలారుషెట్టి సైదయ్య, అంకతి వెంకటరమణ, అంకతి సత్యం, కొనకంచి లక్ష్మయ్య, పోకల వెంకటేశ్వర్లు, పెరిక కులస్తులు, వికలాంగుల తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం బలోపేతానికి కృషి

మిర్యాలగూడ టౌన్ : పెరిక సంఘం బలోపేతంతో పాటు వికలాంగుల సంక్షేమ సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, రాష్ట్ర పెరిక కుల సాధన సమితి అసోసియేట్ అధ్యక్షులు కోట మల్లిఖార్జున్ అన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో వారిని ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు బొలిశెట్టి వీరభద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇండ్ల గణేష్, ఎం.లక్ష్మీ నారాయణ, నాగ మల్లేష్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప యాత్ర-2 శనివారం మిర్యాలగూడకు చేరుకుంది. అనంతరం స్థానిక రాజీవ్‌గాంధీ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, పొలగాని వెంకటేష్ గౌడ్, ఎంఏ సలీం, ఆరీఫ్, మల్లిఖార్జున్‌రావు, అజార్, సికిందర్ లతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

రఘువీర్‌కే మా మద్దతు

నిడమనూరు : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికే పెరిక కులస్తులందరి మద్దతు ఉంటుందని వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. సంకల్ప యాత్ర-2 శనివారం ఇండ్లకోటయ్యగూడెంకు చేరుకున్నది. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన పెరిక కుల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోట మల్లిఖార్జున్ మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సత్యం, నాయకులు కృష్ణయ్య, సత్యం, నాగేశ్వరరావు, సైదయ్య, వెంకటయ్య, జానకిరాములు పాల్గొన్నారు.

రోడ్ల వెంట చెత్త వేస్తే జరిమానా



రోడ్ల వెంట వేసిన చెత్తను ఆటోలోకి ఎత్తుతున్న మున్సిపల్ సిబ్బంది

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీల్లో రోడ్ల వెంట చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం రోడ్ల వెంట వేసిన చెత్తను ఆటోల్లో ద్వారా తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికీ ఆటోలు వస్తున్నాయని, ఆటోలు వచ్చిన సమయంలో చెత్తను దాంట్లో వేయాలని కోరారు. అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్(నందికొండ)ను అందంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. మెయిన్‌రోడ్ల వెంట చెత్తతో పాటు కోళ్లు, జంతువుల కళేబరాలు, చేపల వేస్టేజీని వేస్తున్నారని ఎట్టి పరిస్థితిలో వేయవద్దని తెలిపారు. మున్సిపాలిటీ సూచనలు పాటించకుండా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామన్నారు. రోడ్ల వెంట వేసిన చెత్తను దగ్గరుండి ఆటోల్లోకి ఎత్తించారు.

కట్టెల మిల్లులో అగ్ని ప్రమాదం



కొండమల్లేపల్లి : మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులోని పస్నూరి జగదీశ్వరాచారికి చెందిన కట్టెల మిల్లులో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

గడ్డిపల్లి కేవీకేలో స్వర్ణోత్సవం

గరిడేపల్లి : దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ డి.నరేష్ మాట్లాడుతూ.. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయంలో వివిధ పద్ధతులపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, రైతు సదస్సులు వంటివి నిర్వహించి వారికి సాంకేతిక విషయాలు తెలియజేస్తుండడంతో వారు పంటలో దిగుబడులు పొందగలుగుతున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ నరేష్

మార్లగడ్డలో గడ్డి వాములు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన గడ్డి వాములు

నిడమనూరు : మండలంలోని మార్లగడ్డ క్యాంపులో శుక్రవారం రాత్రి ఆరు గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. మార్లగడ్డ క్యాంపునకు చెందిన సపావత్ స్వామి, సపావత్ గోప, దేపావత్ శ్రీను, సూర్య, మంగ్లాలకు చెందిన గడ్డివాములు వరుసగా వేసుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమయ్యాయని బాధిత రైతులు పేర్కొన్నారు. ఫైర్‌ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో వచ్చి ఆర్పినట్లు రైతులు తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. రైతుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఐ శశికుమార్ ఉదయం పంచనామా నిర్వహించారు.

మే డేను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కార్మిక శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శనివారం మే డే పోస్టర్ ఆవిష్కరించినంతరం ఆయన మాట్లాడారు. మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, లెనిన్, రవి, జాని, యూసుఫ్, దస్తగిరి, రాములు, యాదయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.